# మధ్యయుగ దక్షిణ భారతదేశ ఆర్థిక వ్యవస్థ

## కాకతీయ యుగం

**క్రీ.శ. 8వ శతాబ్దం నుంచి క్రీ.శ. 18వ శతాబ్దం మధ్య కాలాన్ని భారతదేశంలో మధ్యయుగంగా పేర్కొంటారు. ఈ కాలంలో ఉత్తర భారతదేశాన్ని రాజపుత్రులు, ఢిల్లీ సుల్తానులు, మొగలులు పరిపాలించారు. ఇదేకాలంలో దక్షిణ భారతదేశాన్ని కాకతీయులు, రెడ్డి రాజులు, విజయనగర రాజులు, బహమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీ పాలకులు పరిపాలించారు. దక్షిణ భారతదేశ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ, వాణిజ్య, పరిశ్రమల రంగాల అభివృద్ధికి ఆయా పాలకులు కృషి చేశారు. కాలానుగుణంగా ద్రవ్య వ్యవస్థలో అనేక రకాల నాణేలను చలామణిలోకి తెచ్చారు.**

**క్రీ.శ. 952 1323 మధ్య ఆంధ్రదేశాన్ని పాలించిన కాకతీయులు ఆంధ్ర రాజులుగా కీర్తిగాంచారు. తెలుగు భాష మాట్లాడే ప్రజలందరినీ ఏకం చేసి, పాలించిన తొలి పాలకులు కాకతీయులు. మొదటి బేతరాజు రాజ్యస్థాపనకు పునాది వేయగా రుద్రదేవుడు స్వతంత్ర పాలన ప్రారంభించాడు. కాకతీయుల్లో గొప్ప పాలకుడు గణపతిదేవుడు. చివరి కాకతీయ చక్రవర్తి రెండో ప్రతాపరుద్రుడు. కాకతీయులు వ్యవసాయాభివృద్ధికి విరివిగా చెరువులు తవ్వించారు.**

- మొదటి ప్రోలరాజు కేసరి తటాకాన్ని, రేచర్ల రుద్రుడు రామప్ప చెరువును, జగదళ ముమ్మడి పాకాల చెరువును తవ్వించారు. బయ్యారం, ఘనపురం, లక్నవరం చెరువులు కాకతీయుల కాలం నాటివే. చెరువుపై అధిపతిని దశబంధ అని, చెరువు నీటిని వాడుకున్నందుకు చెల్లించే రుసుమును 'దశబంధ మాన్యం' అని వ్యవహరించేవారు. గ్రామాల్లో ఆయగాండ్రు (గ్రామోద్యోగులు) మేర రూపంలో శిస్తు వసూలు చేసేవారు. కౌలు రైతులను అర్ధశీరి అని, వారు చెల్లించే కౌలును కోరు అని పిలిచేవారు.
- భూములను సర్వే చేయడానికి పెనుంబాకం, మానదండం, కేసరిపాటిగడ లాంటి పరికరాలను ఉపయోగించేవారు. నాటి భూములను రాచ పొలం, నీరు పొలం, తోట పొలం, వెలి పొలంగా వర్గీకరించారు. బాగా పంటలు పండే వ్యవసాయ భూములను 'అచ్చుకట్ల భూమి' అనేవారు. సన్నిగండ్ల శాసనంలో కొలగాండ్రు, కరణాల ప్రస్తావన కనిపిస్తుంది. కోటగణపాంబ వేయించిన మొగలుట్ల శాసనం ద్వారా వృత్తి పన్నుల గురించి తెలుసుకోవచ్చు. గొర్రెల మందలు, యాదవ వర్గాలపై వేసే పన్నును అడ్డ సుంకం లేదా అడ్డవట్ల సుంకం అనేవారు. పన్ను కట్టాల్సిన రైతులను అరిగాపులు అని, పన్ను వసూలు చేసే అధికారులను కొల గాండ్రు లేదా సుంక ప్రెగ్గడ అనేవారు. ధనరూపంలో విధించే లేదా చెల్లించే పన్నును పట్టపు హుండీగా, ధాన్యరూపంలో విధించే లేదా చెల్లించే పన్నును పట్టుకొలచుగా పేర్కొనేవారు.
- ఓరుగల్లు ప్రాంతంలో సువాసనలు వెదజల్లే బియ్యాన్ని పండించేవారని చరిత్రకారులు పేర్కొన్నారు. రాజన్నశాలి అనేది నాటి ఒక వరి వంగడం.
- కాకతీయ యుగంలో పన్నులు అధికంగానే ఉండేవి.
- రాజు దర్శనం కోసం చెల్లించే పన్ను - దర్శనం.
- రాజు అకారణంగా విధించే పన్ను - అప్పణం
- యువరాజు భృతి కోసం చెల్లించే పన్ను - ఉపకృతి లేదా దొగరాజు పన్ను.
- నాడు భూమి శిస్తు 1/6 నుంచి 1/3 వంతు వరకు ఉండేది. నాటి మచిలీపట్నం వస్త్రాలు, మోటుపల్లి రేవు, వజ్ర పరిశ్రమల గురించి మార్కోపోలో 'మై పిలిగ్రిమ్స్/ మై ట్రావెల్స్' అనే తన గ్రంథంలో వివరించాడు. పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్ర గ్రంథంలో 20 కి పైగా వస్త్ర రకాలను వివరించాడు. ఓరుగల్లులో రత్నకంబళ్లు, ముఖమల్ వస్త్రాలు తయారయ్యేవి. నిర్మల్ కత్తులు సిరియా రాజధాని డమాస్కస్‌కు ఎగుమతి అయ్యేవి. మోటుపల్లి, కృష్ణపట్నం, హంసలదీవి, మైసోలియా (మచిలీపట్నం) లాంటి ఓడరేవుల ద్వారా విదేశీ వాణిజ్యం జరిగేది. మోటుపల్లి నాటి ప్రధాన ఓడరేవు.
- వర్తకులు నకరం, స్వదేశీ, పరదేశీ, నానాదేశీ లాంటి శ్రేణులుగా ఏర్పడేవారు. త్రిపురాంతకంలో అయ్యావళి అయినూరరు అనే కన్నడ వర్తక శ్రేణి ఉండేది. యనమదల శాసనం నాటి వర్తక శ్రేణుల గురించి తెలుపుతోంది. కాకతీయ యుగంలో ప్రధాన బంగారు నాణెం గద్యాణం. దీన్నే నిష్క లేదా మాడ అనేవారు. రూక అనేది ప్రధాన వెండి నాణెం. ఒక మాడకు పది రూకలు అని బాపట్ల దేవాలయ శాసనం పేర్కొంటోంది. ఇటీవల కాలంలో బయటపడిన కాకతీయుల కాలంనాటి ద్రెక్మ అనే నాణెం గ్రీకు నాణేలను పోలి ఉంది. చైనా నుంచి సిల్కును దిగుమతి చేసుకునే వారని మార్కోపోలో పేర్కొన్నాడు.



R-25-12-16

### కాకతీయ అనంతర యుగం

ఈ యుగంలో దక్షిణ భారతదేశంలో ముసునూరి నాయక రాజులు, రేచర్ల పద్మనాయకులు, రెడ్డిరాజులు పరిపాలించారు.

- ఈ యుగంలో 1/6 వంతు భూమి శిస్తు వసూలు చేసినట్లు విలస తామ్ర శాసనం పేర్కొంటోంది. దేవ బ్రాహ్మణ మాన్యాలపై పన్ను మినహాయింపు ఉండేది. 1/10 వ వంతు దశబంధ మాన్యంగా వసూలు చేసేవారు. నాటి ప్రధాన ఆహార పంట జొన్న. ప్రధాన వాణిజ్య పంట ద్రాక్ష. పెదకోమటి వేమారెడ్డి భార్య సూరాంబిక గుంటూరు జిల్లాలోని ఫిరంగిపురం వద్ద సంతానసాగరం చెరువు తవ్వించగా, ఆమె కుమారుడు రాచ వేమారెడ్డి ఆ చెరువుకు జగనొబ్బగొండ అనే కాలువను తవ్వించాడు. రేచర్ల పద్మనాయక రాజు మాదానీడు భార్య నాగాంబిక నాగసముద్రం చెరువును తవ్వించింది. అనపోతు సముద్రం, రాయసముద్రం చెరువులను కూడా రేచర్ల వెలమలు తవ్వించారు. నాడు వస్త్ర పరిశ్రమ అత్యంత అభివృద్ధి చెందిన పరిశ్రమగా పేరొందింది. పలనాడు, వినుకొండ ప్రధాన వస్త్ర పరిశ్రమ కేంద్రాలు. కొరవి గోపరాజు తన సింహాసన ద్వాత్రింశిక గ్రంథంలో అనేక రకాల పట్టు, నేత వస్త్రాలను శ్రీలంకకు ఎగుమతి చేసేవారని రాశాడు. కొండవీడుకు చెందిన అవచి తిప్పయ్యశెట్టి విదేశీ వాణిజ్యంలో అత్యంత ప్రముఖుడిగా పేరుగాంచాడు. శ్రీనాథుడు రచించిన హరవిలాసం గ్రంథం కప్పలి, జోంగు, వలి, వల్లికా లాంటి నౌకల రకాలను వివరించింది. జోంగు అనేది చైనా దేశానికి చెందిన వాణిజ్య నౌక.

### కుతుబ్‌షాహీ యుగం

వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ప్రభుత్వ ఆదాయం 5 కోట్ల హొన్నులు అని, అందులో 19 లక్షల హొన్నుల నికర ఆదాయం ప్రభుత్వ ఖజానాలో చేరేదని మెథోల్డ్ పేర్కొన్నాడు. వజ్రాలు, ఇనుము - ఉక్కు, దారు (చెక్క) పరిశ్రమ బాగా అభివృద్ధి చెందాయి. కోహినూర్ వజ్రం అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో కొల్లూరు గనుల్లో దొరికింది. కొల్లూరు గనుల్లో 30 వేల మంది కార్మికులు పనిచేసేవారని మెథోల్డ్ పేర్కొన్నాడు. నిర్మల్, ఇందూర్, ఇందల్‌వాయ్ ప్రాంతాలు ఆయుధ పరిశ్రమకు ప్రఖ్యాతి చెందాయి. కొండపల్లి, నర్సాపురం చెక్క పరిశ్రమకు ప్రసిద్ధి. మచిలీపట్నం నాటి ప్రధాన ఓడరేవు. మచిలీపట్నంలో కలంకారీ వస్త్రాలు, తెరచాప వస్త్రం, తుపాకి మందు, తూటాలు తయారు చేసేవారు. నర్సాపురం, మచిలీపట్నంలలో నౌకలు తయారు చేసేవారు. ఎగుమతి - దిగుమతి సుంకం 3 1/2 శాతం ఉండేది. కానీ పులికాట్ రేవులో మాత్రం 2 1/2 శాతంగా ఉండేది. నాటి ప్రధాన బంగారు నాణెం హొన్ను. దాన్నే 'పగోడా'గా వ్యవహరించేవారు. ఫణం వెండి నాణెం. తార్, కాసులు రాగి నాణేలు. హొన్నులో 16 వ వంతు ఫణం. ఫణంలో 32 వ వంతు తార్. కుతుబ్‌షాహీ యుగంలో ఆర్థిక మంత్రిని మీర్‌జుమ్లా అనేవారు.

### విజయనగర రాజుల కాలం

1336 లో విజయనగర సామ్రాజ్యాన్ని హరిహర, బుక్కరాయలు ప్రారంభించారు. ఈ సామ్రాజ్యాన్ని సంగమ, సాళువ, తుళువ, అరవీడు వంశాలు వరుసగా పరిపాలించాయి. శ్రీకృష్ణదేవరాయల కాలాన్ని దక్షిణ భారతదేశంలో స్వర్ణయుగంగా పేర్కొంటారు. విజయ నగర రాజుల కాలంలో భారతదేశానికి వచ్చిన ఇబన్‌బటూటా, నికోలోకాంటి, అబ్దుల్ రజాక్, డొమింగో పేస్, న్యూనిజ్, బార్బోసా, అథ నేషియన్ నికెటిన్ లాంటి విదేశీయుల రచనల ద్వారా నాటి ఆర్థిక వ్యవస్థ గురించి తెలుసుకోవచ్చు.

- రెవెన్యూ శాఖను అట్టావన్ అని పిలిచేవారు. కేసరి పాటిగడ (తీరాంధ్ర ప్రాంతం), దొరగడ (రేనాడు/ కడప ప్రాంతం) లాంటి పరికరాలతో భూమిని సర్వే చేయించి, విభజించారు. మాగాణి భూమిని నీరాంబర అని, మెట్ట భూమిని కాడాంబర అని పిలిచేవారు. బ్రాహ్మణ ఇనాములపై 1/6 వ వంతు, దేవాలయ భూములపై 1/30 వ వంతు పన్ను వసూలు చేసేవారు. భూమి శిస్తు 1/3 వంతు ఉండేది. పన్నులను ధనరూపంలో లేదా ధాన్య రూపంలో చెల్లించవచ్చు. గ్రామాల్లోని భూములను కవిలె సంప్రతులు అనే ఉద్యోగులు కవిలెల్లో నమోదు చేసేవారు.
- స్వర్ణకారులు చెల్లించే పన్ను - సిద్ధాయం
- సాలె వారు చెల్లించే పన్నులు - పింజ సిద్ధాయం, మగ్గరి
- కుమ్మర్లు చెల్లించేది - చక్రకానికె పన్ను
- పచ్చిక బయళ్లలో పశువులను మేపినందుకు చెల్లించేది - పుల్లరి పన్ను
- యాచకులపై విధించే పన్ను గణాచారి పన్ను
- ఇళ్లపై విధించేది ఇల్లరి పన్ను
- ఉప్పుపై వేసిన పన్ను - ఉప్పరి పన్ను

- పెళ్లి సుంకాన్ని వైవాహిక సుంకం లేదా గుడికళ్యాణం అనేవారు. నాగులాపురంలో ప్రవేశించే వస్తువులపై 42 వేల పగోడాల ఆదాయం వచ్చేదని న్యూనిజ్ పేర్కొన్నాడు. తుళువ వీర నరసింహుడు తొలిసారిగా వైవాహిక సుంకాన్ని రద్దు చేశాడు. శ్రీకృష్ణ దేవరాయలు కందనవోలు (కర్నూలు), చంద్రగిరి ప్రాంతాల్లో వివాహ సుంకాన్ని రద్దు చేశాడు. కొండోజు అనే మంగలి ప్రార్థన వల్ల అళియరామరాయలు మంగలి పన్నును రద్దు చేశాడు. శ్రీకృష్ణదేవరాయలి కొండవీడు శాసనం 59 రకాల వస్తువులపై ఉన్న పన్నుల గురించి వివరిస్తోంది. విజయనగర కాలంలో ఆర్థిక సంవత్సరం మహర్నవమితో ప్రారంభమయ్యేది.
- విజయనగర కాలం నాటి చెరువుల గురించి పోరుమామిళ్ల శాసనం (కడప జిల్లా) ద్వారా తెలుసుకోవచ్చు. మొదటి బుక్కరాయల కాలంలో పెనుగొండ వద్ద శిరువేరు తటాకం, సాళువ నరసింహుని కాలంలో అనంతపురం వద్ద నరసాంబుధి తటాకం, శ్రీకృష్ణ దేవరాయల కాలంలో నాగులాపురం, కంభం చెరువులు తవ్వించారు. శ్రీకృష్ణదేవరాయలు పోర్చుగీసు ఇంజినీర్ల సహాయంతో తుంగభద్రపై తూరుట్టు, కావేరిపై కృష్ణరాయసాగర్, కొరుగల్లు అనే ఆనకట్టలను నిర్మించాడు.
- వ్యవసాయేతర వృత్తి పన్నులను శుల్కాదాయం అనేవారు. సాలె, కమ్మరి, కుమ్మరి మొదలైన వారు చెల్లించే పన్నును జాతి సిద్ధాయం అనేవారు. దేశమంతటా పండ్లు చౌకగా లభించేవని, తోటలు విస్తారంగా ఉన్నాయని డొమింగో పేస్ రాశాడు. వస్త్ర, లోహ, వజ్ర పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందాయి. తాడిపత్రి, ఆదోని, గుత్తి, వినుకొండ నూలు వస్త్ర పరిశ్రమకు కేంద్రాలు. వజ్రకరూర్ ప్రాంతం వజ్రాలకు పేరుగాంచింది. గ్రామాల్లో జరిగే స్థానిక సంతల గురించి శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్త మాల్యద గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. నాటి వ్యాపార కేంద్రాల గురించి హంశవింశతి గ్రంథం వివరిస్తోంది. విజయనగర సామ్రాజ్యంలో 300 ఓడరేవులు ఉండేవని అబ్దుల్ రజాక్ పేర్కొన్నాడు.
- మోటుపల్లి రేవు కోసం విజయనగర, రెడ్డి రాజ్యాల మధ్య సుదీర్ఘకాలం ఘర్షణలు జరిగాయి. పులికాట్ రేవులోని హిందూ, ముస్లిం వర్తకుల గురించి, ఎగుమతి- దిగుమతుల గురించి బార్బోసా పేర్కొన్నాడు. టోకు వర్తకులు హెర్జుకం అనే పన్ను చెల్లించేవారు. నాడు కాలికట్ ప్రధాన నౌకా నిర్మాణ కేంద్రం.
- నాటి గ్రామీణ జీవన విధానం గురించి బార్బోసా తన రచనల్లో వివరించారు. పశుపోషకులను కంబలత్తార్/ కురుబలు/ ఇదయసులు అని పిలిచేవారు.
- సాలెవారు - కైకోలులు
- వ్యవసాయదారులు - వక్కలి లేదా వెల్లాలు
- గారడీ విద్యలు ప్రదర్శించే వారు - విప్రవినోదులు
- గద్యాణం నాటి ప్రధాన బంగారు నాణెం. దాన్నే వరహా అనేవారు. ఎక్కువగా వాడుకలో ఉన్న బంగారు నాణెం ఫణం. తార్ అనే వెండి నాణెం, జిటాల్, కాసు అనే రాగి నాణేలు చలామణిలో ఉండేవి. దీనారం అనే పర్షియన్ (ఇరాన్) నాణెం కూడా వాడుకలో ఉండేది. తార్ అనే వెండి నాణెం ఫణంలో ఆరో వంతు.

**రచయిత: బి.నాగరాజు**

www.eenadupratibha.net